
ఉగ్రవాదులపై కాల్పులు జరుపుతున్న భద్రతాదళాలు (మాక్‌డ్రిల్..)

విపత్తు సంభవిస్తే..

- ఉగ్రదాడిని ఎదుర్కొని... ప్రజలను రక్షించేలా
- ఆకట్టుకున్న అధికారుల 'మాక్‌డ్రిల్'...
- కలెక్టర్, ఎస్పీ పరిశీలన


క్షతగాత్రుడిని రక్షిస్తున్న రెస్క్యూ బృంద సభ్యులు

శ్రీకాకుళం క్రైం/ కలెక్టరేట్, మే 13(ఆంధ్రజ్యోతి): ఊహించని విపత్తు సంభవిస్తే.. బాంబు దాడిలో అధిక మంది క్షతగాత్రులయితే.. ప్రజలను ఏవిధంగా క్షణాల వ్యవధిలో కాపాడాలన్నది స్పష్టంగా తెలిపేలా శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో మంగళవారం 'మాక్‌డ్రిల్' నిర్వహించారు. ఇటు రాష్ట్ర విపత్తుల నిర్వహణ బృందం(ఎస్‌డీఆర్‌ఎఫ్), అటు జిల్లా పోలీసు, అగ్నిమాపక, ఆర్టీసీ, రెవెన్యూ.. ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది సంయుక్తంగా పాల్గొని మాక్‌డ్రిల్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఉగ్రవాదులపై పోలీసులు, భద్రతా బలగాలు కాల్పులు జరుపుతూనే.. ప్రజలకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి స్వయంగా మాక్‌డ్రిల్‌ను పరిశీలించారు.


ప్రమాదం సంభవిస్తే.. సహాయక చర్యలపై అవగాహన

● ఉగ్రవాదుల దుశ్చర్య..
ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పేలిన బాంబు...

ప్రస్తుతం 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో ఉగ్రదాడులు జరిగితే ఎలా స్పందించాలి.. జనసంచారం ఉన్న ప్రాంతాల్లో ఉగ్రవాదులు పేల్చిన బాంబుల దాడి నుంచి ప్రజలను ఎలా రక్షించాలన్నదే మాక్‌డ్రిల్ ఉద్దేశం. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఆర్టీసీ ఉద్యోగులు, విశాఖ నుంచి వచ్చిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు.. ప్రజలకు మాక్‌డ్రిల్‌ను కళ్లకు కట్టినట్లు చూపించారు. ఉగ్రవాదుల దుశ్చర్యలో భాగంగా వందలాది జన సంచారం ఉండే శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బాంబు పేలితే.. ఏరీతిన స్పందించాలో వివరించారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బాంబును ఉగ్రవాదులు అమర్చడం.. ఆ సమాచారాన్ని నేరుగా కలెక్టరేట్‌లో ఉన్న కంట్రోల్ రూమ్‌కు చేరడం.. ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బంది క్షణాల్లో స్పందించి సంఘటనా ప్రాంతానికి రావడం.. ఈలోగా బాంబు పేలి నలుగురు మృతి చెందగా.. 15 మందికి (మిగతా 6వ పేజీలో..)


మాక్‌డ్రిల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఉపాధ్యాయ బదిలీలకు సిద్ధం

- ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన ప్రక్రియ



పాతశ్రీకాకుళం, మే 13(ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పూర్తికి రంగం సిద్ధమైంది. సుదీర్ఘ కసరత్తు, ఉపాధ్యాయ సంఘాలతో సమాలోచనలు మేరకు నిర్దిష్టమైన ప్రణాళికతో ఆన్‌లైన్ విధానంలో బదిలీల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం ఉన్న పాఠశాలలను 9 రకాలుగా విభజించి, బదిలీలకు శ్రీకారం చుట్టింది. శాటిలైట్ ఫౌండేషనల్, ఫౌండేషనల్ స్కూల్, బేసిక్ ప్రైమరీ, మోడల్ ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హైస్కూల్(6 నుంచి 10 తరగతులు), హైస్కూల్ (1 నుంచి 10 తరగతులు), హైస్కూల్ ప్లస్ (6 నుంచి 12వ తరగతి), హైస్కూల్ ప్లస్ (1 నుంచి 12వ తరగతి) వరకు ఉండేలా పాఠశాలలను విద్యాశాఖ అధికారులు విభజించారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మోడల్ ప్రైమరీ హెచ్‌ఎంలుగా/ స్కూల్ అసిస్టెంట్‌లుగా మారుస్తూ జిల్లాలో 249 పోస్టులు కేటాయించారు. 35 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కన్వర్ట్ చేశారు. 288 పోస్టులను హెచ్‌వోడీ పూల్‌లో ఉంచారు. జిల్లాలో 43 ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జీవోఎంఎస్ నెంబరు 19, జీవోఎంఎస్ నెంబరు 21లను ప్రభుత్వం విడుదల చేసింది. తొలుత ప్రధానోపాధ్యాయులను బదిలీ చేస్తారు. తర్వాత ఏర్పడిన ఖాళీల్లో స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పిస్తారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల ఖాళీల మేరకు సెకండరీ గ్రేడ్ టీచర్లకు పదోన్నతులు ఇస్తారు. 8ఏళ్లు పూర్తిచేసుకున్న ఉపాధ్యాయులను తప్పనిసరిగా బదిలీ చేయనున్నారు. రెండేళ్ల లోపు సర్వీసు ఉన్న ఉపాధ్యాయులకు బదిలీల నుంచి మినహాయింపు ఇస్తారు.

జవహర్ నవోదయ విద్యార్థుల ప్రతిభ

- సీబీఎస్ఈ ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత

పాతశ్రీకాకుళం/ సరుబుజ్జిలి, మే 13(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయాల (జేఎన్‌వీ) విద్యార్థులు సీబీఎస్ఈ 10, 12 తరగతుల ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపారు. సరుబుజ్జిలి మండలం వెన్నెలవలసలోని జేఎన్‌వీలో పదో తరగతిలో 79మంది పరీక్షలకు హాజరై 100 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ పరుశురాం తెలిపారు. మొత్తం 81 మంది విద్యార్థుల్లో ఇద్దరు తీవ్ర అనారోగ్యం కారణంగా పరీక్షకు హాజరుకాలేదన్నారు. 'స్కూలు సగటు మార్కులు 80.7 శాతం కాగా, తెలుగు 86.22శాతం, హిందీ 81.71శాతం, సైన్స్ 81.73శాతం సగటుతో మెరుగైన ఫలితాలు నమోదయ్యాయి. 12వ తరగతి విదార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారు. 34 మంది పరీక్షలు రాసి అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఇంగ్లీష్ 81.09 శాతం కెమిస్ట్రీ, 79.76శాతం కంప్యూటర్ సైన్స్, 79.82శాతం సగటు మార్కులతో విదార్థులు ప్రతిభ కనబరిచారు' అని ప్రిన్సిపల్ వెల్లడించారు. ఈ విజయానికి కారణమైన ఉపాధ్యాయులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి 7లో
- శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉద్యోగుల నిరసన

భూ సర్వేలో అక్రమాలపై అన్నదాతల ఆందోళన 8లో
- కొత్తూరులో తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

అమ్మో ల్యాబ్‌లు!

- జిల్లాలో ఇష్టారాజ్యంగా నిర్వహణ
- కానరాని నిబంధనలు
- రోగుల నుంచి అదనంగా వసూలు
- పట్టించుకోని వైద్యారోగ్య శాఖ అధికారులు

ఇచ్ఛాపురం, మే 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మెడికల్ ల్యాబ్‌ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మెడికల్ ల్యాబ్‌ల ఏర్పాటుకు కచ్చితమైన నిబంధనలు పాటించాలి. చిన్నపాటి ల్యాబ్‌లకైనా ఎంబీబీఎస్ అర్హత సాధించే వైద్యుడు పర్యవేక్షించాలి. పెద్ద ల్యాబుల్లో అయితే పాథోలజిస్టులు, రేడియోలజిస్టులు, మైక్రోబయోలజిస్టులు ఉండాలి. వారికి సహాయకారులుగా ల్యాబ్ టెక్నీషియన్లు వ్యవహరించాలి. కానీ జిల్లాలోని మెడికల్ ల్యాబ్‌ల్లో ఎక్కడా ఈ నిబంధనలు అమలుకావడం లేదు. డయోగ్నస్టిక్ సెంటర్లు, స్కానింగ్ కేంద్రాల పేరిట నిర్వాహకులు నిలువుదోపిడీకి పాల్పడుతున్నారు. కొందరు వైద్యులు కమీషన్లకు కక్కుర్తిపడి అవసరం ఉన్నా.. లేకున్నా రోగులకు స్కానింగ్‌కు రిఫర్ చేస్తున్నారు. చిన్న రుగ్మత ఉన్నా రక్త, మూత్ర పరీక్షలు చేయిస్తున్నారు. ఇదే అదనుగా స్కానింగ్‌లు, రక్తపరీక్షల పేరిట ల్యాబ్ నిర్వాహకులు రూ.వేలకు వేలు వసూలు చేస్తున్నారు.

● ఇబ్బడిముబ్బడిగా..

జిల్లావ్యాప్తంగా 200 వరకూ ల్యాబ్‌లు ఉన్నాయి. ఇందులో వైద్యారోగ్య శాఖ రిజిస్ట్రేషన్ పొందినవి కొన్నే. జిల్లా వైద్యాధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో పుట్టగొడుగుల్లా ల్యాబ్‌లు పుట్టుకొస్తున్నాయి. ఒక్క శ్రీకాకుళంలోనే 70 వరకూ ల్యాబ్‌లు ఉన్నాయి. రక్త పరీక్షకు రూ.700నుంచి రూ.2,200 వరకూ వసూలు చేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. స్కానింగ్‌లకు కూడా రూ.1,500 నుంచి రూ.3వేల వరకు వసూలు చేస్తున్నారు. కంచిలి మండలం జాడుపూడి ఆర్ఎస్‌లో బోర్డులు లేని ల్యాబ్‌లు కూడా చాలా ఉన్నాయి. చాలాచోట్ల అర్హత సర్టిఫికెట్లు, కనీసం రిజిస్ట్రేషన్ కూడా లేకుండా నిర్వహిస్తున్నారు. ప్రతి ప్రైవేటు ఆస్పత్రికి అనుబంధంగా ఒక ల్యాబ్ ఉంటోంది. రోగి విధిగా అక్కడే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి. వారు ఎంత అడిగితే అంత ఇచ్చుకోవాల్సిందే.

● ప్రస్తుతం ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో వైద్య పరీక్షలు చేయిస్తోంది. కానీ అవి ఆశించిన స్థాయిలో ఫలితం ఇవ్వడం లేదు. ర్యాపిడ్ కిట్ల ద్వారా పరీక్షలు చేస్తుండ డంతో వ్యాధి నిర్ధారణ సక్రమంగా జరగడం లేదు. ఈసీజీ, హిమోగ్లోబిన్, గర్భ నిర్ధారణ యూరిన్ టెస్ట్, ర్యాండమ్ గ్లూకోజ్ టెస్ట్, మలేరియా టెస్ట్, హెచ్‌ఐవీ టెస్ట్, డెంగీ టెస్ట్, మల్టీ పారా యూరిన్ టెస్ట్, ఆయోడిన్ టెస్ట్, వాటర్ టెస్టింగ్, హెపటైటిస్ బి టెస్ట్, ఫైలేరియా పరీక్ష, సిఫిలిస్ ర్యాపిడ్ తదితర పరీక్షలు నిర్వహిస్తున్నా.. ఏవీ పూర్తి స్థాయిలో నిర్ధారించలేకపోతున్నారు. దీంతో రోగులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ల్యాబుల వైపు మొగ్గు చూపుతున్నారు.


ఇచ్ఛాపురంలో ఆసుపత్రి రోడ్డులో మెడికల్ ల్యాబ్..


కంచిలి మండలంలో ల్యాబ్

● రోగులతో కిటకిట

జిల్లాలో జ్వరాలు, ఇతర వ్యాధులతో బాధపడుతున్న రోగులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన సేవలు అందక.. చాలా మంది ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. వారు వివిధ రకాల పరీక్షలను చేయించుకోవాలంటూ రోగులను ప్రైవేటు ల్యాబ్‌లకు సిఫారసు చేస్తున్నారు. ఇదే అదనుగా ల్యాబ్‌ల నిర్వాహకులు అధిక డబ్బులు వసూలు చేసి దోచుకుంటున్నారు. కొందరు ల్యాబ్‌ల నిర్వాహకులు ఆర్ఎంపీలతో బేరం కుదుర్చుకుంటున్నారు. గ్రామాల్లో ఏ చిన్న వైద్యసేవలకైనా ప్రజలు ఆర్ఎంపీలపైనే ఆధారపడతారు. వైద్య పరీక్షల కోసం రోగులకు సిఫారసు చేసినందుకు ఆర్ఎంపీలకు ల్యాబ్ నిర్వాహకులు కొంతమొత్తంలో కమీషన్లు చెల్లిస్తున్నారు. ఆ భారం రోగులపైనే వేస్తున్నారు. డెంగ్యూ వంటి నిర్ధారణ పరీక్షలకు అనుమతి లేనప్పటికీ.. కొంతమంది ల్యాబ్‌ల (మిగతా 6వ పేజీలో..)

కుదిరిన వేతన ఒప్పందం

- జీడి కార్మికులకు 10శాతం అదనంగా ఇచ్చేందుకు వ్యాపారుల అంగీకారం

పలాస, మే 13(ఆంధ్రజ్యోతి): జీడి వ్యాపారులు- కార్మిక సంఘ నాయకుల మధ్య వేతన ఒప్పందం కుదిరింది. మంగళవారం స్థానిక జీడిపప్పు ఉత్పత్తిదారుల సంఘం భవనం(పీసీఎంఏ)లో ఇరువర్గాల నాయకులు సమావేశమై వేతన ఒప్పందాన్ని కుదుర్చుకొని లేఖలు అందించుకున్నారు. రెండేళ్లకోసారి జీడి కార్మికులు చర్చల ద్వారా వేతన ఒప్పందాన్ని కుదుర్చుకుంటారు. ఈ ఏడాది రెండుసార్లు సమావేశమైనా ఒప్పందం ఖరారు కాకపోవడంతో ఈ నెల 16 నుంచి సమ్మెకు దిగుతామని కార్మిక సంఘ నాయకులు అధికారులకు లేఖలు అందించారు. ఈ నేపథ్యంలో వ్యాపారులు అత్యవసర సమావేశాన్ని నిర్వహించి వేతన ఒప్పందాన్ని ఖరారు చేశారు. ప్రస్తుత వేతనం కంటే 10శాతం అదనంగా ఇచ్చేందుకు అంగీకరించారు. దీంతోపాటు బాయిలింగ్ వేసే కార్మికులకు బస్తాకు రూ.71, కటింగ్ చేసేవారికి కిలోకు రూ.34, పీలింగ్ కార్మికులకు కిలోకు రూ.12.50, ఎండబోత చేసే కార్మికులకు రూ.43చొప్పున ఇచ్చేందుకు ఇరువర్గాల నాయకులు నిర్ణయించారు. వేతన ఒప్పందానికి సహకరించిన ఎమ్మెల్యే గౌతు శిరీషకు వారంతా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జీడి వ్యాపారసంఘ అధ్యక్షుడు మల్లా శ్రీనివాస్, కోశాధికారి మల్లా సంతోష్, కార్మికసంఘ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి సాన ఈశ్వరరావు, కోశాధికారి కోనారి రాము, వర్కింగ్ సెక్రటరీ సిందిరి సతీష్‌కుమార్, పట్నాన శ్రీనివాస్ పాల్గొన్నారు.


సమావేశమైన వ్యాపార, కార్మిక సంఘ నాయకులు

రైతులకు మరిన్ని సేవలు

- వ్యవసాయ, ఉద్యానశాఖలో క్షేత్రస్థాయి సిబ్బంది రేషనలైజేషన్
- పంటల విస్తీర్ణం ఆధారంగా బాధ్యతలు


ఈ-క్రాప్ నమోదు చేస్తున్న గ్రామీణ వ్యవసాయశాఖ సహాయకులు (ఫైల్)

టెక్కలి, మే 13(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో రైతులకు మరిన్ని సేవలు అందించేలా వ్యవసాయ, ఉద్యానశాఖల్లో సమూల మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సచివాలయాల్లో క్లస్టర్లుగా మార్చి.. రైతులు సాగుచేసే పంటల విస్తీర్ణం అనుగుణంగా గ్రామీణ వ్యవసాయ, ఉద్యానశాఖ సహాయకుల్ని నియమించనుంది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాల యూనిట్‌గా హేతుబద్ధీకరణ(రేషనలైజేషన్) ప్రక్రియను అధికారులు చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో 6,03,760 ఎకరాల భూములకు తగ్గట్టు 556 మంది గ్రామీణ వ్యవసాయ సహాయకులు, 85 మంది గ్రామీణ ఉద్యానవనశాఖ అధికారులు, ఒక గ్రామీణ సెరీకల్చర్ సహాయకులు, అర్బన్ ప్రాంతాల్లో 18మంది మండల విస్తరణాధికారులు మొత్తంగా 660 మందిని నియమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. వాస్తవానికి పల్లపు ప్రాంతాల్లో గ్రామీణ వ్యవసాయ సహాయకులు, కొండలు, తీరప్రాంతాల్లో గ్రామీణ ఉద్యానవనశాఖ సహాయకులకు క్షేత్రస్థాయి బాధ్యతలు పెరగనున్నాయి. ఒక్కో గ్రామీణ వ్యవసాయ సహాయకులకు సుమారు 940 ఎకరాల వరకు, గ్రామీణ ఉద్యానవనశాఖ సహాయకులకు 600 ఎకరాల వరకు రైతులు పండించే పంటలకు బాధ్యులుగా ఉంచాలని నిర్ణయించారు. అలాగే 1200 ఎకరాల భూమి విస్తీర్ణం దాటిన తరువాత మండల విస్తరణాధికారులను నియమించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇంకా అవసరమైతే 16మంది వరకు మల్టీపర్పస్ విస్తరణాధికారులను తీసుకోనున్నారు. జిల్లా పునర్విభజనకు ముందు 820 సచివాలయాలకు, 18 అర్బన్ సచివాలయాల్లో క్షేత్రస్థాయిలో సిబ్బంది ఉండగా, తాజాగా రేషనలైజేషన్ ప్రాప్తికి 660 మందికి కుదించనున్నారు. అయితే జిల్లాలో మిగిలిన సిబ్బందిని ఏ రకంగా భర్తీ చేస్తారో వేచిచూడాల్సి ఉంది. ప్రస్తుతం జిల్లాలో 556 మంది గ్రామీణ (మిగతా 6వ పేజీలో..)


టెక్కలి మండలం పరశురాంపురంలో సిరిమాను సంబరాలు

ఊరూరా.. పండుగ 6లో
- జిల్లావ్యాప్తంగా గ్రామదేవత ఉత్సవాలు
- పంచభూతాలకు ప్రతీకగా అమ్మవార్లు
- అంబరాన్నంటిన సంబరాలు

ఊరూరా.. పండుగ

- జిల్లావ్యాప్తంగా గ్రామదేవత ఉత్సవాలు
- పంచభూతాలకు ప్రతీకగా అమ్మవార్లు

రణస్థలం, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గ్రామదేవత ఉత్సవాలు జరుగుతున్నాయి. పల్లె, పట్నం తేడా లేకుండా ఎక్కడ చూసినా అమ్మవారి సంబరాలు అంబరాన్ని తాకుతున్నాయి. పంచభూతాలకు ప్రతీకలుగా నిలిచే గ్రామదేవతలు సాధారణంగా ఊరి పొలిమేరల్లో ఉంటారు. గ్రామస్థులను.. వారు పండించే పంటలను అన్నిరకాల ఉపద్రవాల నుంచి రక్షిస్తుంటారు. అమ్మవార్లను తమ ప్రాంతాలకు అనుగుణంగా ప్రజలు పిలుచుకుంటారు. మాతకు పర్యాయపదమ్మైన అమ్మ, అంబ, తల్లి, కాళీ, చండీ, కాత్యాయని, భైరవి తదితర పేర్లతో అమ్మవార్లను కొలుస్తారు. ప్రతీపేరు వెనుక పరమార్థం, ప్రత్యేక చరిత్ర ఉంటుంది. పృథ్వీ అంటే భూమి.. ఇదే పంటకు ప్రధాన ఆధారం. కుంకుళ్లు బాగా పండే ప్రాంతంలో ప్రతిష్ఠించే గ్రామదేవతను కుంకుళ్లమ్మ అని.. గోగులు పూజించే ప్రాంతంలో గోగులమ్మ అని.. జొన్నలు పండించే ప్రాంతంలో జొన్నాళమ్మ అని.. వరి బాగాపండే ప్రాంతంలో నూకాలమ్మ ఇలా రకరకాల పేర్లతో దశబ్దాలుగా గ్రామదేవతను పూజిస్తున్నారు. పొలిమేరల్లో ఉంటుంది కనుక పోలేరమ్మ, ఎల్లల్లో ఉంటుంది కనుక ఎల్లారమ్మ, ఎల్లమ్మ ఇలా ఏ పేరుతో పిలిచినా పలికేది గ్రామదేవత అమ్మవారే.

సంప్రదాయం ప్రకారం..

జిల్లాలో సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో గ్రామదేవత ఉత్సవాలు, చల్లదనం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఏడాది, మూడేళ్లు, ఐదేళ్లు, తొమ్మిదేళ్లు, పదేళ్లు, పదకొండేళ్లు, పన్నెండేళ్లు, పదిహేనేళ్లు, ఇరవై ఏళ్లు, ఇరవై ఒకటేళ్లు, 25 ఏళ్లు.. ఇలా తమ


రణస్థలంలో దుర్గాదేవికి ముర్రాటలు (ఫైల్)


జేఆర్‌పురంలో పైడితల్లమ్మకు మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

గ్రామ ఆచారాలను అనుసరించి గ్రామదేవత ఉత్సవాలు జరుపుతారు. తమ ఊరును, పాడి పంటలను, పిల్లా పాపలను కాపాడాలని సామూహికంగా పండగ చేసుకుంటారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా గ్రామదేవత ఉత్సవాలు జరుగుతున్నాయి. ఐదు, తొమ్మిది, కొన్నిచోట్ల నెల రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. కేవలం ఆధ్మాత్మిక చింతనే కాకుండా.. ఐకమత్యం కోసం ఈ గ్రామదేవత ఉత్సవాలు జరుపుతుంటారు. కుల, మత, రాజకీయ వర్గ విభేదాలను పక్కనపెట్టి అంతా ఏకతాటిపైకి వస్తారు. కుటుంబ స్థితిగతులు, జీవన పరిస్థితులు, వృత్తి, వ్యాపారం, ఉద్యోగం ఆదాయాన్ని అనుసరించి విరాళాలు, చందాలు పోగుచేస్తారు. తమ బంధువులను, స్నేహితులు, సన్నిహితులను పిలిచి గ్రామదేవత సంబరాలను ఘనంగా నిర్వహిస్తారు.

ఇదో ప్రత్యేకం..

జిల్లాలో గ్రామదేవతల పండుగలో ప్రతి ఘట్టం కీలకమే. అమ్మవార్లకు దండకం చదివి.. శంఖం ఊది.. పసుపు, కుంకుమలతో పూజలు చేస్తారు. గ్రామదేవతకు స్పష్టమైన రూపం, ఆకారం ఉండదు. కొన్నిచోట్ల రూపం గుండ్రంగా ఉంటుంది. ఉత్సవాల్లో మహిళలు అలంకరించిన బోనాలు, ఘటాలను ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పిస్తారు. కొత్తకుండలో పసుపునీళ్లు పోసి.. పసుపు బొట్లతో అందంగా అలంకరిస్తారు. కుండ మెడకు వేపాకుల తోరణాలు కడతారు. కొత్త తెల్లని వస్త్రంతో నవధాన్యాలు పోస్తారు. ఘటం ఎత్తే ముందు దీపం వెలిగించి అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తారు. ప్రతీ ఇంటికీ మామిడాకులు, వేపాకులతో తోరణాలు కడతారు. కోళ్లు, మేకలకు బలి ఇచ్చి అమ్మవారిని సంతృప్తపరుస్తారు.

ఎందరికో ఉపాధి..

గ్రామదేవతల పండుగలంటే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతోమందికి ఉపాధి దొరుకతుంది. కనుమరగయ్యే ప్రాచీన, పౌరాణిక కళలు జీవం పోసుకుంటాయి. ప్రధానంగా పల్లెల్లోనే ఈ ఉత్సవాలు ఎక్కువగా జరుగుతుంటాయి. అందుకే డ్రామాలు, బుర్రకథలు, గ్రామీణ కళలకు ఎక్కువగా ఆదరణ ఉంటుంది. కాళికా నృత్యాలు, డప్పువేషాలు, తప్పెటగుళ్లు, పులివేషాలు, కోలాటం, చెక్కభజన, బిందెల నృత్యం, కోయిడాన్స్, పాండురంగ భజన ఇలా అన్ని ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఇక జాయింట్ వీల్ ఇతరత్రా పిల్లలను ఆకర్షించే అనేక రకాల ఈవెంట్లతో పదుల సంఖ్యలో కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి.

దశాబ్దాల ఆనవాయితీ..

మా గ్రామంలో నిర్ణీత వ్యవధిలో గ్రామదేవత ఉత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సమయంలో ఎంత దూరంలో ఉన్నా.. ఏ దేశంలో స్థిరపడినా.. ఇక్కడకు వస్తుంటారు. గ్రామదేవతను దర్శనం చేసుకొని మొక్కులు చెల్లించుకుంటారు. ప్రజల మధ్య ఎన్నిరకాల విభేదాలు ఉన్నా.. గ్రామదేవత ఉత్సవాల విషయానికి వచ్చేసరికి మాత్రం తామంతా ఒక్కటేనని చాటి చెబుతాం.

-మహేశ్వరరావు, అర్జునవలస, రణస్థలం మండలం

ప్రతీ ఇంటి పండుగ..

గ్రామదేవత ఉత్సవాలు అంటే ప్రతి ఇంటి పండుగ. ప్రతీ గ్రామానికి రక్షగా గ్రామదేవతలు ఉంటారు. ఊరు బాగోగులు చూసుకోవాలని ఆ భగవంతుడే గ్రామదేవతకు బాధ్యతలు అప్పజెబుతారంటారు. అందుకే ఆ దేవతను ఏటా చల్లదనం చేస్తుండాలి. నిర్ణీత వ్యవధిలో ఉత్సవాలు జరుపుతూ ఉండాలి.

-పిన్నింటి భానోజీనాయుడు, రణస్థలం


కొత్తగ్రహారంలో అమ్మవారి రథం ఊరేగిస్తున్న దృశ్యం

అంబరాన పాలపోలమ్మ తల్లి సంబరం

నందిగాం, మే 13 (ఆంధ్రజ్యోతి): కొత్తగ్రహారంలో పాలపోలమ్మతల్లి సంబరం అంబరాన్ని తాకింది. మంగళవారం అమ్మవారి రథం ఊరేగింపుతో సందడి నెలకొంది. మేళతాళాలు, తప్పెటగుళ్లు, పగటి వేషాల మధ్య రథంపై పూజారి ఆచారి అప్పారావు ఆశీనులయ్యారు. వందలాది మంది ఘటాలతో ముందుకు కదలగా... పురవీధుల్లో ఊరేగింపు సాగింది. ఈ ఉత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నందిగాం ఎస్ఐ షేక్ మహ్మద్ అలీ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

సందడిగా గ్రామదేవత సంబరాలు

టెక్కలి, మే 13 (ఆంధ్రజ్యోతి): పరశురాంపురం, సొర్లిగాం, అయోధ్యపురం, చిన్నకేదారి గ్రామాల్లో గ్రామదేవతల సంబరాలు మంగళ వారంతో సందడిగా ముగిశాయి. 102 ఏళ్ల తరువాత పరశురాంపురంలో జోగిపోలమ్మ అమ్మవారి సిరిమాను సంబరం నిర్వహించారు. ఓవైపు సిరిమాను, మరోవైపు ఘటాలతో అమ్మవారికి చల్లదనం చేశారు. సొర్లిగాంలో కొండరేగుపోలమ్మ అమ్మవారి ఘటాలతో ఊరేగింపు నిర్వహించారు. అయోధ్యపురంలో 22ఏళ్ల తరువాత పాలపోలమ్మతల్లి సంబరాలు నిర్వహించారు. భక్తజనంతో సందడి నెలకొంది. ముఖలింగాపురం పంచాయతీ చిన్నకేదారిలో ఊరమ్మతల్లి సంబరం మిన్నంటింది.


సొర్లిగాంలో కొండరేగుపోలమ్మను ఘటాలతో ఊరేగిస్తున్న దృశ్యం


ముర్రాటలో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

ఘనంగా అమ్మవారి పండగ

జి.సిగడాం, మే 13(ఆంధ్రజ్యోతి): మెట్టవలస గ్రామదేవత అసిరితల్లి పండగ ఘనంగా నిర్వహించారు. గ్రామదేవత ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో తిరువీధి నిర్వహించారు. వందలాది మంది భక్తులు అమ్మవారికి ముర్రాటలు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నాగవేషాలు, మహిళా కోలాటం, పులివేషాలు, పలు వినోద కార్యక్రమాలు ప్రదర్శించారు. ఆరు రోజులుగా నిర్వహిస్తున్న అసిరితల్లి పండగ మంగళవారంతో ముగిశాయి.

గుక్కెడు నీటి కోసం పాట్లు

- మందస ఏజెన్సీలో మొరాయిస్తున్న రక్షితనీటి పథకాలు

- మందస మండలం హొన్నాళి గ్రామంలో రెండు రక్షితనీటి పథకాలున్నా... నీరు లభించక మహిళలు ఇలా ఇబ్బందులు పడుతున్నారు. చెంతనే మహేంద్రతనయా నది ఉన్నా తాగునీటి పథకం నీరు రాక.. బోర్లులో నీరు లభించక సుదూర ప్రాంతం నుంచి నది నీటిని తెస్తున్నారు.



హరిపురం, మే 13 (ఆంధ్రజ్యోతి)

మందసమండలంలో ఏజెన్సీ ప్రజలకు తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన ఉద్దానం ప్రాజెక్టు ద్వారా నీరు రాకపోవడం.. ఏజెన్సీలో రక్షిత నీటి పథకాలు మొరాయిస్తుండటంతో.. గుక్కెడునీటి కోసం మహిళలు పడుతున్న పాట్లు వర్ణనాతీతం. మందస మండలంలోని గిరిజన ప్రాంతాల ప్రజలు నీటికోసం నానా యాతన పడుతున్నారు. మండలంలోని డబార్సింగి, పాతబుడంబో, కిల్లోయి, బలియాసాయి, డలసరి, పుట్టూరు, లొడకపిట్టతోపాటు సాబకోట, చీపి పంచాయతీల పరిధిలో నీరు పుష్కలంగా లభిస్తున్నా.. కలుషితం కావడంతో తాగేందుకు పనికిరావడం లేదని ఆయా గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహేంద్రతనయా నది చెంతనే ఉన్నా.. హొన్నాళి, బుడార్సింగి వంటి గ్రామాల్లో నీటి కష్టాలు తీరడంలేదని పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



- మందస మండలం డలసరిలోని దుస్థితిది.. తాగునీరు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెలమల వద్ద గోతులు తవ్వి నీటిని తెచ్చుకొని తాగేందుకు విని యోగిస్తున్నారు. గ్రామంలో తాగునీటి బోర్లు సైతం లేకపోవడంతో ఈ ఇబ్బందికర పరిస్థితి నెలకొంది.


మొక్కులు తీర్చుకుంటున్న మహిళలు

ఘనంగా నూకాలమ్మ ఉత్సవాలు

పాతపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి): గంగువాడ గ్రామంలో మంగళవారం నూకాలమ్మతల్లి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మూడు రోజులు పాటు ఈ ఉత్సవాలు కొనసాగాయి. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మహిళలు ఘటాలతో అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్నారు. చాకపల్లిలో జరిగిన గ్రామదేవత ఉత్సవాల్లో పాతపట్నం ఎమ్మెల్యే ఎంజీఆర్ పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

విపత్తు సంభవిస్తే..

(ఐదో పేజీ తరువాయి)

తీవ్రగాయాలపాలవ్వడం.. ప్రజలు భయాందోళన చెందడం దృశ్యాలను మాక్‌డ్రిల్‌లో చూపించారు. మరో 35 మంది పరిస్థితి విషమంగా మారడంతో.. క్షతగాత్రులను స్ట్రక్చర్‌పై నుంచి అంబులెన్స్‌లో ఆసుపత్రిలో చేర్పించడం.. అలాగే ఉగ్రవాదుల దాడి నుంచి ప్రజలను రక్షించడం వంటి సంఘటనలను వివరించారు. క్షతగాత్రులుగా.. ప్రమాద మృతులుగా పోలీసులు, ఆర్టీసీ సిబ్బంది జీవించారు. ఈ దృశ్యాలను ప్రజలు చూస్తుండగా.. ఇతర శాఖల పనితీరు ఎలా ఉంది... లోపాలను కలెక్టర్ గుర్తించారు. అవసరమైన సూచనలు సిబ్బందికి తెలియజెప్పారు. ఉగ్రదాడులు.. ఇతర ప్రమాదకరఘటనలు జరిగితే ఏరీతిన చర్యలు తీసుకోవాలో వివరించారు. కలెక్టర్, ఎస్పీ విలేకర్లతో మాట్లాడుతూ ప్రజలను ప్రమాద సంఘటనలో పలు ప్రాంతాల్లో అప్రమత్తం చేసేలా పైడిభీమవరం ఫార్మా కంపెనీల ద్వారా అలారం, అలాగే పలాస, శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్‌ల వద్ద హెచ్చరికలు జారీచేశాయని చెప్పారు. లోపాలను గుర్తించి సరిచేశామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ సాయి ప్రత్యూష, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, డీఎస్పీ వివేకానంద, ఏఆర్ డీఎస్పీ శేషాద్రి, జిల్లా అగ్నిమాపక అధికారి మోహనరావు, ఆర్టీసీ ఆర్ఎం విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.


క్షతగాత్రుడికి తక్షణ వైద్యసహాయంపై అవగాహన

అమ్మో ల్యాబ్‌లు!

(ఐదో పేజీ తరువాయి)

నిర్వాహకులు వాటిని సైతం చేస్తున్నట్టు హడావుడి చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఈ విషయం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిసినా.. చూసీ చూడనట్టు వదిలేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ల్యాబ్‌ల నిర్వాహకుల అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

- **భయం వేస్తోంది..**

వైద్య పరీక్షలు అంటేనే భయం వేస్తోంది. జ్వరం అంటేనే రక్త పరీక్షలు చేయాల్సి వస్తోంది. ఆ సమయంలో ఎంత వసూలు చేస్తున్నారో తెలియడం లేదు. ఇదేమని ప్రశ్నిస్తే ల్యాబ్ నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ర్యాపిడ్ టెస్టులు చేస్తుండడంతో వ్యాధుల నిర్ధారణ కావడం లేదు. దీంతో ప్రైవేటు ల్యాబులను ఆశ్రయించాల్సి వస్తోంది.

-పి.ఢిల్లీ, ఇచ్ఛాపురం

చర్యలు తప్పవు

అనుమతులు లేకుండా మెడికల్ ల్యాబ్‌లు నిర్వహిస్తే చర్యలు తప్పవు. జిల్లావ్యాప్తంగా తని ఖీలు నిర్వహిస్తాం. అనుమతులు, అర్హత లేకుండా ల్యాబ్‌లు నిర్వహిస్తున్న వారిపై కఠినచర్యలు తీసుకుంటాం.

-డాక్టర్ అనిత, డీఎంహెచ్‌వో, శ్రీకాకుళం

రైతులకు మరిన్ని సేవలు..

(ఐదో పేజీ తరువాయి)

వ్యవసాయ సహాయకులు ఉండడంతో రేషనలైజేషన్ ప్రక్రియ ఇబ్బందులు లేకుండా జాబితాలను సిద్ధం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రతిపాదనలపై గ్రామీణ ఉద్యానవన సహాయకులు మాత్రం ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై టెక్కలి వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు బీవీ తిరుమలరావు వద్ద ప్రస్తావించగా.. 'గ్రామీణ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు రైతులకు అన్నివిధాలా క్షేత్రస్థాయిలో సహాయపడేందుకు ఈ ప్రతిపాదనలు ఉపకరించనున్నాయి. ప్రతి వీఏఏకు 900 ఎకరాల విస్తీర్ణం పైబడి బాధ్యతలు అప్పగించనున్నామన్నారు.

ఫోన్ చేస్తే సమస్య పరిష్కారం

- అన్నదాతల కోసం 155251 టోల్ ఫ్రీ నెంబరు
- వాట్సాప్ నెంబర్ 8331056028 కూడా..
- వినియోగించుకోవాలంటున్న అధికారులు



గుంటూరులోని కాల్ సెంటర్ భవనం

శ్రీకాకుళం, మే 13(ఆంధ్రజ్యోతి): అన్నదాత తన పంటలకు సంబంధించి ఇంటి నుంచే సమస్యను చెప్పుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో రైతుల సందేహాల నివృత్తి కోసం ఆత్మ ప్రాజెక్టు ప్రధాన కార్యాలయం (గుంటూరు)లో సమీకృత రైతు సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. రైతులు తమ సమస్యలపై 155251 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయవచ్చు. అలాగే, చీడపీడల సమస్యలు తెలుసుకోవడానికి 8331056028 వాట్సాప్ నెంబరు కూడా ఏర్పాటు చేసింది. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రైతులు తమ సమస్యలపై టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయవచ్చు. వారి సమస్యలను తెలుసుకుని వెంటనే వారికి తగిన సలహాలు, సూచనలు ఇస్తారు. చీడపీడలు ఆశించినా?, ఎటువంటి పురుగు మందులు పిచికారి చేయాలి? ఎటువంటి ఎరువులు వేయాలి? వంటివి తెలుసుకోవడానికి ఒక్కఫోన్ చేస్తే సమాచారం వస్తుంది. పంట పొలాల్లో పురుగులు, తెగుళ్లు ఉంటే సరైన సమాచారం కోసం వాటి ఫొటోలను తీసి వాట్సాప్ నెంబర్‌కు పంపిస్తే దానికి అనుగుణంగా శాస్త్రవేత్తల ద్వారా సలహాలు, సూచనలు అందుతాయి. వ్యవసాయ అనుబంధ శాఖలైన ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య, పట్టుపరిశ్రమకు సంబంధించి సందేహాలను నివృత్తి చేసుకోచ్చు. పంటల రకాలు, విత్తన శుద్ధి, పోషక సమస్యలు, కలుపు, పురుగు, తెగుళ్లు, యాజమాన్యం, పాడి పశువులు, సన్న జీవాల యాజమాన్యం, చేపల పెంపకంపై రైతులకు తగిన సమాచారం అందిస్తారు. ఒకే ప్రాంతం నుంచి ఒకే రకమైన సమస్యలు ఎక్కువ మంది రైతుల నుంచి వస్తే దాన్ని తీవ్రంగా పరిగణిస్తారు. దీనిపై జిల్లా స్థాయిలో ఉన్న వన రుల కేంద్రానికి సమాచారం అందిస్తారు. ఆ ప్రాంతంలో అందుబాటులో ఉన్న శాస్త్రవేత్తలతో క్షేత్రస్థాయిలో సంద ర్శన చేసి, ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహిస్తారు. సమస్యకు అనుగుణంగా రైతులకు సలహాలు, సూచనలు ఇస్తారు. రైతులు ఈ నెంబర్లను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.


కాల్ సెంటర్‌లో సిబ్బంది

పోక్సో చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలి

- నేరస్థులకు శిక్షపడేలా దర్యాప్తు ఉండాలి
- స్కూల్స్, కళాశాలల వద్ద పెట్రోలింగ్ పెంచాలి
- ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, మే 13(ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికలపై జరిగే శారీరక, లైంగిక వేధింపుల నేరాలు అరికట్టేందుకు పోక్సో చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి, చట్టాన్ని మరింత పటిష్ఠంగా అమలు చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి మంగళవారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా డీఎస్పీలు, సీఐ, ఎస్ఐలతో పోక్సో, క్రైమ్ కేసుల దర్యాప్తు, విచారణ, ప్రస్తుత స్థితి కేసుల్లో సాధించిన పురోగతి తదితర అంశాలపై ఏఎస్పీ కేవీ రమణతో కలిసి సమీక్షించారు. అపరిష్కృతంగా ఉన్న పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, కేసుల్లో పురోగతి సాధించి నేరస్థులకు శిక్ష పడేలా దర్యాప్తు చేయాలన్నారు. స్టేషన్ల వారీగా పోక్సో కేసుల దర్యాప్తులో సాధించిన పురోగతి, సాంకేతిక ఆధారాలు, చేపట్టిన చర్యలపై ఆరా తీశారు. క్రైమ్ అగెనెస్ట్ ఉమెన్ కేసుల్లో నిర్ణీత 60 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేసి అభియోగ పత్రాలను కోర్టులో దాఖలు చేయాలన్నారు. స్కూళ్లు, కాళాశాలల వద్ద శక్తి బృందాలతో పోలీసు పెట్రోలింగ్ పెంచాలన్నారు. విద్యార్థిని, విద్యార్థులకు పోక్సో మహిళా చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో డీసీఆర్బీ సీఐ శ్రీనివాసరావు, సైబర్ సెల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు గోవిందరావు, నేతాజీ, జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీసు అధికారులు వారి కార్యాలయాల నుంచి పాల్గొన్నారు.


జూమ్‌లో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా వెంకటగిరిలో గల ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆ సంస్థ ఓఎస్డీ ఎస్.గిరిధరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో 53 సీట్లకు, తమిళనాడు రాష్ట్రం సీలంలో 12 సీట్లకు, కర్ణాటకలోని గడగ్‌లో 4 సీట్లకు మూడేళ్ల డిప్లమా కోర్సులో ప్రవేశాలు కల్పించనున్నట్టు తెలిపారు. 10వ తరగతి లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై, జూలై 1వ తేదీ నాటికి బీసీ, జనరల్ కేటగిరీ అభ్యర్థులు 15 నుంచి 23 ఏళ్ల మధ్య వయసు, అలాగే ఎస్సీ, ఎస్టీలకు 25 ఏళ్లు వరకు ఉండవచ్చన్నారు. ఈ మూడేళ్ల కోర్సులో ఇంటర్మీడియట్ ఎంపీసీ, ఇంటర్ ఒకేషనల్(టెక్స్‌టైల్), ఐటీఐ(రెండు సంవత్సరాలు) కోర్సులో ఉత్తీర్ణులైనవారు నేరుగా డీహెచ్‌టీటీ రెండో ఏడాదిలో ప్రవేశం ఉంటుందన్నారు. డబ్లుడబ్లుడబ్లు.ఐఐహెచ్‌టివిజిఆర్.కామ్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, జూన్ 1 చివరి తేదీ అని అన్నారు. మరిన్ని వివరాలకు 08625-295003, 9399936872, 9866169908, 9010243054 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

బాలల హక్కుల రక్షణ చట్టంపై అవగాహన

ఇచ్ఛాపురం, మే 13(ఆంధ్రజ్యోతి): బాలల కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని ప్రతీ చట్టం తెలుసుకొని అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ పీవో నాగరాణి అన్నారు. మంగళవారం ఇచ్ఛాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో గల అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర్ వికాసం సమ్మర్ స్పెషల్ కాంపెయిన్‌లో కిశోర్ బాలికలతో సమావేశం నిర్వహించారు. సూపర్‌వైజర్లు సుజాత, నీలవేణి, లక్ష్మి, పల్లవి, పుష్పలత, కృష్ణవేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర్ వికాస గ్రామ కమిటీ సభ్యులు ఎస్ఎంలు, వీవోఏలు పాల్గొన్నారు.

అందుబాటులో నీరు ఉంచాలి

గార, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల నిర్మిస్తున్న పశువుల నీటి కుండీలు వద్ద నీటి సౌకర్యం అందుబాటులో ఉంచాలని పలువురు సభ్యులు అధికారులను కోరారు. ఎంపీపీ గొండు రఘురామ్ అధ్యక్షతన మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు కె.శ్రీహరి, కె.నాగభూషణరావు, టి.అప్పారావు తదితరులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గొండు రఘురామ్ సూచించారు. జల్‌జీవన్ పథకం ద్వారా ఏర్పాటు చేస్తున్న మంచినీటి ట్యాంక్‌లు నిర్మాణం పనులు తొందరగా పూర్తి చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. శ్రీకూర్మం పంచాయతీలో ఇటీవల కొందరు ప్రభుత్వ రిజర్వు స్థలాలను ఆక్రమించుకున్నారని వైస్‌ఎంపీపీ బరాటం భాగ్యలక్ష్మి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. తహసీల్దార్ ఎం.చక్రవర్తి, ఎంపీడీవో ఎస్.రామ్మోహన్‌రావు, విద్యుత్ ఏఈ కె.కమలహాసన్, ఏవో ఐ.మురళి, వెలుగు ఏపీఎం వి.సుజాత, ఆర్‌అండ్‌బీ ఏఈ సీహెచ్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

19న కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

సరుబుజ్జిలి, మే 13(ఆంధ్రజ్యోతి): ఈ నెల 19న ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల ఇంటర్వ్యూలు ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం.పావని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఆదాయ కుల ధ్రువీకరణ పత్రాలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆన్‌లైన్ చేసిన దరఖాస్తుతో హాజరుకావాలన్నారు.

డీసీసీబీ ఛైర్మన్‌కు అభినందన

సరుబుజ్జిలి, మే 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ పదవులను భర్తీ చేయడంలో కూటమి ప్రభుత్వం విజ్ఞతతో వ్యవహరిస్తూ సమర్థులకు పదవులను ఇస్తుందని రిటైర్డ్ తహసీల్దార్, కాళింగ సంఘ నేత, టీడీపీ నాయకుడు పేడాడ జనార్దనరావు అన్నారు. శ్రీకాకుళం జిల్లా డీసీసీబీ ఛైర్మన్‌గా నియమితులైన శివ్వాల సూర్యనారాయణ నియమితులైన సందర్భంగా షలంత్రి గ్రామంలోని తన నివాసంలో మంగళవారం సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కిల్లి శేషు, ఎస్.వెంకటరావు, సీహెచ్ బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నివారించాలి

ఆమదాలవలస, మే 13(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను ప్రతి ఒక్కరూ నివారించాలని పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ నాగళ్ల మురళీధర్ యాదవ్ అన్నారు. మంగళవారం పురపాలక సంఘంలోని పదో వార్డు హడ్కో కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాలు రహిత భారతదేశం అనే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలల హక్కుల రక్షణ, బాల్య వివాహాలు చేయడం వల్ల జరిగే అనర్థాలు కోసం వివరించారు. బాలల కోసం అనేక చట్టాలు ఉన్నాయని, వాటిని తెలుసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో బాలల హక్కుల రక్షణ కమిటీ సభ్యులు రీసు చిరంజీవి, టీడీపీ నాయకులు రాచకొండ రాజు, సచివాలయం మహిళా పోలీస్ ఉమ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నూతన కార్యవర్గం ఎన్నిక

సోంపేట, మే 13(ఆంధ్రజ్యోతి): బారువ పట్టణ టీడీపీ కార్యవర్గాన్ని రాష్ట్రకార్యదర్శి సూరాడ చంద్రమోహన్, మండల పార్టీ అధ్యక్షుడు మద్దిల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మడ్డు గురుమూర్తి, ఉపాధ్యక్షుడిగా తోట తాతయ్య, కార్యదర్శిగా దున్న సత్యనారాయణ, మిగతా పదవుల్లో గొరకల నాగేశ్వరరావు, ఆణింగి జగదీష్, కాళ్ల జేజేరావును ఎన్నుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

శ్రీకాకుళం కలెక్టరేట్, మే 13(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఎంఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీఆర్‌కే రావు, అప్పయ్య ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆందోళన చేశారు. రాష్ట్ర కార్యదర్శి కేవీఆర్ నరసింగరావు, తదితరులు మాట్లాడుతూ.. ఉద్యోగుల క్రమశిక్షణ చర్యల విషయంలో, అలాగే సిబ్బంది అనారోగ్య సందర్భంగా ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా సిబ్బందికి ప్రత్యేక సందర్భాల్లో సెలవులను మంజూరు చేయాలని, వారికి రెస్ట్ రూమ్స్, టాయిలెట్ సదుపాయం కల్పించాలని, రిటైర్డు ఉద్యోగులకు ఆరోగ్యశ్రీ, వృద్ధాప్య పింఛన్ అమలు చేయాలని కోరారు. గ్యారేజీలు, వివిధ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, ఆన్‌కాల్, హైర్‌బస్సు డ్రైవర్లకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని, మరిన్ని కొత్త బస్సులు మంజూరు చేయాలని, నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ డబ్బులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం 1డిపో నాయకులు, 2డిపో నాయకులు, టెక్కలి, పలాస డిపో అధ్యక్షులు, కార్యదర్శులు, పెద్ద సంఖ్యలో సభ్యులు హాజరయ్యారు.

నేటి నుంచి సత్యసాయి రథోత్సవం


రథయాత్ర బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్, మే 13(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14 నుంచి సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథోత్సవం నిర్వహించనున్నట్టు రాష్ట్ర సత్యసాయి సేవా సమితి అధ్యక్షులు ఆర్.లక్ష్మణరావు అన్నారు. మంగళవారం సత్యసాయి పెద్దమందిరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భగవాన్ సత్యసాయిబాబా శతజయంత్యుత్సవాల సందర్భంగా సత్య సాయి ప్రేమ ప్రవాహిని అనే దివ్యరథం కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశమంతటా అన్ని రాష్ట్రాల్లో ప్రయాణిస్తుందని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు మాట్లాడుతూ.. జిల్లాలో ఈ రథయాత్ర ఈ నెల 14వ తేదీ బుధవారం బూర్జ మండలం, లక్కుపురం గ్రామం వద్ద స్వాగతం పలుకుతారని, అక్కడి నుంచి ఆమదాలవలస, ఎల్ఎన్ పేట, హిరమండలం, కొత్తూరు, పాతపట్నం, మందస, సారవకోట, జలుమూరు, పలాస, మెళియాపుట్టి, వజ్రపుకొత్తూరు, ఇచ్ఛాపురం, టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, నరసన్నపేట, గార, శ్రీకాకుళం, ఎచ్చెర్ల రణస్థలం మండలాల్లో పర్యటించి ఈ నెల 18వ తేదీన విశాఖ జిల్లా వారికి అందచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పూర్వపు జిల్లా అధ్యక్షుడు గంగుల రమణబాబు, బోయిన నరసింహమూర్తి, పప్పల నాగేశ్వరరావు, కిల్లా ఫల్గుణరావు, పిట్ట గంగాధర్, వట వృక్షాలమూర్తి, లాడి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కొబ్బరి తెగుళ్లు పరిశీలన

కవిటి, మే 13(ఆంధ్రజ్యోతి): ఉద్దానం ప్రాంతంలో కొబ్బరిపంటకు ఆశించిన తెగుళ్లను ఉద్యాన పరిశోధన కేంద్రం, పెద్దిపేటకు చెందిన శాస్త్రవేత్త రాజశేఖర్ పరిశీలన చేశారు. బల్లిపుట్టుగ గ్రామంలో మంగళవారం రైతులతో కలిసి కొబ్బరితోటలను పరిశీలించారు. కొబ్బరిలో ఆశించిన తెల్లదోమ, గ్యానోడెర్మా, ఎర్రముక్కు, నల్లముట్టి పురుగులు నివారణకు తీసుకోవాల్సిన పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో రైతులు బి.చిన్నబాబు, వి.గోపి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.


బల్లిపుట్టుగలో తెల్లదోమ తెగులును పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయం

జి.సిగడాం, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్‌ఈఆర్) అన్నారు. మంగళవారం మెట్టవలసలో జరుగుతున్న గ్రామదేవత అసిరితల్లి పండగలో పాల్గొన్న అనంతరం ఆయన నాయకులు, గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామ దేవత అందరికీ ఆయురారోగ్యాలతో పాటు పాడి పంటలతో చల్లగా చూడాలని కోరుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే గ్రామాలు అభివృద్ధి బాటలో నడుస్తున్నాయన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు లేనిపోని విమర్శలు చేసున్నారన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు పైల విష్ణుమూర్తి, బూరాడ వెంకటరమణ, పైల సింహాద్రినాయుడు, పైల సత్యనారాయణ, పైల కూర్మారావు, గొర్లె రామినాయుడు, కామోజుల సీతారాం, బెవర జగన్నాథరావు తదితరులు ఉన్నారు.


నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్‌ఈఆర్

ప్రకృతి వ్యవసాయం అవగాహనపై ర్యాలీ

ఎచ్చెర్ల, మే 13(ఆంధ్రజ్యోతి): బొంతలకోడూరు పంచాయతీ లావేటిపేట, రుప్పపేట గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల ప్రయోజనాలను వివరించారు. నవధాన్యాల సాగు- నేలతల్లి బాగుపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం పొన్నాడ యూనిట్ ఇన్‌చార్జి పైడి మన్మధరావు, స్థానిక మాజీ వైస్ సర్పంచ్ లావేటి అన్నారావు తదితరులు పాల్గొన్నారు.



మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి

రణస్థలం, మే 13(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు తీరం వెంబడి సంచరిస్తే తక్షణమే సమాచారం ఇవ్వాలని కళింగపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి.హరికృష్ణ అన్నారు. అల్లివలస, జగన్నాథపురం గ్రామాల్లో మంగళవారం మత్స్యకారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉగ్రవాదులు సముద్రం మీదుగా వచ్చే సూచనలు ఉన్నాయని, కొత్తముఖాలు కనిపిస్తే వెంటనే 1093 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. చేపల వేటకు వెళ్లే సమయంలో మత్స్యకారులు తీసుకోవాల్సిన జాగ్రత్తల కోసం వివరించారు. కార్యక్రమంలో పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు.


అల్లివలస మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బాడీబిల్డింగ్ పోటీల్లో ప్రతిభ

శ్రీకాకుళం స్పోర్ట్స్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న సత్యసాయి జిల్లా కదిరిలో జరిగిన మిస్టర్ ఆంధ్ర బాడీబిల్డింగ్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపారు. శ్రీకాకుళం పట్టణానికి చెందిన వి.విజయ్ కుమార్ 80 కిలోల కేటగిరిలో కాంస్య పతకం సాధించగా, హరిపురం గ్రామానికి చెందిన కొండా అవినాష్ 60 కిలోల కేటగిరిలో రజిత పతకాన్ని సొంతం చేసుకున్నారు. గెలుపొందిన క్రీడాకారులకు స్థానిక ఎమ్మెల్యేయ గొండు శంకర్, ది ఆంధ్రా బాడీబిల్డింగ్ అసోసియేషన్ సభ్యులు వాడపల్లి శ్రీనివాసరావు, స్వామి రమేష్, రాజ్‌కుమార్, అశోక్ జనార్థన్, మనోహర్ ఈశ్వర్, శ్రీకాకుళం బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సభ్యులు కె.గౌరీశంకర్, చీఫ్ ప్యాట్రన్ దేవభూషణ్, ఫిట్‌నెస్ జోన్ గోపాల్, ప్రసాద్, బి.సూరిబాబు తదితరులు అభినందించారు.


పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

దివ్యాంగుల సర్వే ప్రారంభం

పొందూరు, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలో దివ్యాంగుల (చైల్డ్‌విత్ స్పెషల్ నీడ్స్) సర్వే ప్రారంభమైంది. పాఠశాలలకు రాలేక చదువుకు దూరమవుతున్న దివ్యాంగ విద్యార్థులను గుర్తించి భవిత కేంద్రాల్లో చేర్పించి విద్యనందించడమే కాకుండా వారికి మౌలిక సదుపాయాలు కల్పించడం ఈ సర్వే ముఖ్య ఉద్దేశమని ఎంఈవో-2 పి.రాజారావు తెలిపారు.

నేడు సదరం సర్టిఫికెట్ల పరిశీలన

ఇచ్ఛాపురం, మే 13(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ భరోసా దివ్యాంగ పింఛన్లు పొందుతున్న అభ్యర్థులకు సంబంధించిన సదరం ధ్రువీకరణ పత్రాల పరిశీలన బుధవారం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో రామారావు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. పింఛన్‌దారులు తమ ధ్రువీకరణ పత్రాలతో రావాలని కోరారు.

ఆరు ఇసుక లారీలు పట్టివేత

రణస్థలం, మే 13(ఆంధ్రజ్యోతి): విశాఖ తరలిస్తున్న ఆరు ఇసుక లారీలను పైడిభీమవరం చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్నారు. జేఆర్ పురం ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాలు మేరకు.. మంగళవారం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తుండగా.. ఈ ఆరు ఇసుక లారీల బిల్లులు నకిలీవిగా గుర్తించామన్నారు. ఈ బిల్లుల నిర్ధారణకు మైన్స్ అధికారులకు పంపించామని, ఆ లారీలను స్టేషన్‌కు తరలించామన్నారు.

20లోగా నమోదు చేసుకోవాలి

జి.సిగడాం, మే 13(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం కోసం ఈ నెల 20వ తేదీలోగా వెబ్‌సైట్‌లో రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఏవో ఎర్రా శారద మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రభుత్వం రూ.20 వేలు అందజేస్తుందన్నారు. ఈ పథకాన్ని కౌలు రైతులకు వర్తించనున్నట్టు తెలిపారు. అయితే కౌలు రైతులు సీసీఆర్సీ కార్డులు కలిగి ఉండాలన్నారు. రూ.10 వేలు పింఛన్ తీసుకునేవారు అనర్హులన్నారు.

- సోంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల తనిఖీని పలాసపురం గ్రామంలో వ్యవసాయాధికారి బి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాబితా విచారణ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షన్‌దారులు, కంపెనీకి చెందిన భూముల అనర్హులని పేర్కొన్నారు. అదేవిధంగా 1బీని ఆధార్ నెంబరుతో లింక్ అయివుందో లేదో అని పరిశీలించారు.

విశ్వశాంతి యజ్ఞం

కంచిలి, మే 13(ఆంధ్రజ్యోతి): దొళాయిపుట్టుగలో గ్రామస్థుల ఆధ్వర్యంలో విశ్వశాంతి కోసం నిర్వహిస్తున్న హరేరామ హరేకృష్ణ నామయజ్ఞంలో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ మంగళవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు అశోక్‌ను దుస్సాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో మాదిన రామారావు, భైరవ సాహు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రీన్‌షేడ్ నెట్ ఏర్పాటు

పాతశ్రీకాకుళం, మే 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన కూడళ్లలోని వాహనదారులకు ఎండ నుంచి రక్షణ కోసం సంబంధిత అధికారులు గ్రీన్‌షేడ్ నెట్స్ ఏర్పాటు చేశారు. గత కొద్దిరోజులుగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో నగరంలోని సిగ్నల్ పాయింట్స్ వద్ద వాహనచోదకులు ఇబ్బందిపడేవారు. దీంతో మంగళవారం ఆయా కూడళ్లలో వాహనదారులకు నీడ కల్పించేందుకు వీటిని ఏర్పాటు చేశారు. కాగా ఏటా వేసవి ప్రారంభంలోనే వీటిని ఏర్పాటు చేసేవారని, ఇప్పుడు మే నెల సగం రోజులు పూర్తయ్యే వరకు వాహనదాల కష్టాలు సంబంధిత అధికారులకు గుర్తురాలేదా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.



బహిరంగ వేలం ప్రకటన దేవదాయ శాఖ

ఆర్.సి.నెం. నిల్/25 తేది: 10-05-2025

శ్రీకాకుళం జిల్లా, జలుమూరు మండలం, శ్రీముఖలింగం గ్రామములో వేంచేసియున్న శ్రీముఖలింగేశ్వర స్వామి వారి దేవస్థానము హక్కు, భుక్తములు గల ఈ క్రింది వివరించిన పల్లం మరియు మెట్టు భూమిని తే: 21/5/2025 దీ ఉదయం: గం. 10.00 ని.లకు సదరు దేవస్థానము కార్యాలయం వద్ద దేవదాయ శాఖ అధికారులు మరియు గ్రామస్తులు సమక్షమలో 3సం.కాలంనకు అనగా 2025-26 సం., నుండి 2027-28 సం., వరకు కౌలుకు ఇచ్చుటకు టెండర్-కం-బహిరంగ వేలం పాట నిర్వహించబడును. కావున ఆసక్తి గలవారు బిట్టు ఒక్కింటికి రూ., 1,00,000/-లు సాల్వెన్సీ సర్టిఫికేట్ మరియు రూ., 30,000/- ప్రథమ ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవలెను. హెచ్చు పాటదారుడు పాట అయిన వెంటనే ఒక సంవత్సరం పూర్తిగా మక్తా/సొమ్మును చెల్లించవలెను. దేవదాయ శాఖ అధికారులు నుండి కౌలు హక్కు ఆమోదము ఉత్తర్వులు వచ్చిన తరువాత భూమిలో సాగుచేయుటకు ప్రవేసించవలెను. ఇతర విషయములు కావలసిన వారు ఆఫీసు పని చేయువేళలో సంప్రదించవలెను.

భూములు ఉన్న గ్రామం: శ్రీముఖలింగం, సర్వేనెం:75/6, విస్తీర్ణం: 2.23(మెట్టు), సర్వేనెం: 80/5, విస్తీర్ణం: 1.42(పల్లం), 1వ బిట్టు విస్తీర్ణం: 4.93, 2వ బిట్టు సర్వేనెం: 65, విస్తీర్ణం: 5.20(పల్లం), 3వ బిట్టు సర్వేనెం: 65, విస్తీర్ణం: 5.20(పల్లం), 4వ బిట్టు సర్వేనెం: 65, విస్తీర్ణం: 5.20(పల్లం), 5వ బిట్టు సర్వేనెం: 65, విస్తీర్ణం: 5.20(పల్లం), 6వ బిట్టు సర్వేనెం: 64/23బి, విస్తీర్ణం: 3.26(మెట్టు)

స్థలం : శ్రీముఖలింగం
తేది: 9/5/2025

ఇట్లు
కార్యనిర్వహణాధికారి
శ్రీ ముఖలింగేశ్వర స్వామి వారి

ఘనంగా బుద్ధుడు జయంతి


ఆనవాలు కోల్పోయిన దంతపురిలో ఉన్న బుద్ధుడి విగ్రహం

శ్రీకాకుళం కల్చరల్, మే 13(ఆంధ్రజ్యోతి): శాంతిని ప్రబోధించి మానవ వికాశానికి దోహదపడిన గౌతమ బుద్ధిడు స్ఫూర్తి విశ్వశాంతికి దిక్సూచిగా నిలుస్తుందని మానవతా చారిటబుల్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ విష్ణుమూర్తి అన్నారు. మంగళవారం శాంతినగర్ కాలనీలో గాంధీ మందిరంలో బుద్ధుడి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రపంచం ఎన్ని రంగాల్లో ఉన్నతి స్థితికి చేరినప్పటికీ బుద్ధుడు శాంతి మంత్రం సజీవంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా బుద్ధుడి బోధనలు ఎందరినో ప్రభావితం చేశాయన్నారు. కార్యక్రమంలో గాంధీ మందిర ప్రతినిధులు బరాటం లక్ష్మణరావు శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.


బుద్ధుడి విగ్రహాని వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

దంతపురిలో జాడలేదు..

సరుబుజ్జిలి, మే 13(ఆంధ్రజ్యోతి): రొట్టవలస సమీపంలో ఉన్న దంతపురి బౌద్ధ క్షేత్రంలో బుద్ధ జయంతి వేడుకలు కానరాలేదు. దేశ, విదేశాల్లో బుద్ధ జయంతి జరిగినా ఇక్కడ జాడ లేకుండా నిర్లక్ష్యం చూపడంపై పురావస్తు, పర్యాటక శాఖాధికారులు తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. ఒకప్పుడు ఇక్కడ జరిపిన తవ్వకాల్లో బౌద్ధ స్తూపాలు బుద్ధుడి కాలం నాటి వంట పాత్రలు తదితర ఆనవాళ్లు బయటపడ్డాయి. దీనిలో 1994లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ ప్రాంతంలో బుద్ధుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ఏటా జయంతిప కార్యక్రమాలు నిర్వహించేవారు. అప్పట్లో దేశ విదేశాల నుంచి బౌద్ధ సన్యాసులు ఈ ప్రాంతానికి చేరుకొని వేడుకలు నిర్వహించారు. కొన్నాళ్లగా పట్టించుకొనే నాథుడు కరువయ్యాడు. ప్రభుత్వాలు మారుతున్నా ఇక్కడి పరిస్థితి మారకపోవడంపై ఎంతో బాధాకరం. దంతపురి పర్యవేక్షణ గైడ్ బాధ్యతలు నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇద్దరు వ్యక్తులకు అవకాశాలు కల్పించి జీతాలు చెల్లిస్తుంది. కనీసం వారు కూడా బుద్ధుడి జయంతి మరిచిపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి దంతపురి బౌద్ధ క్షేత్రానికి పూర్వవైభవం తీసుకురావాలని కోరుతున్నారు.

క్షేత్ర సహాయకుడిపై విచారణ

జి.సిగడాం, మే 13(ఆంధ్రజ్యోతి): పెంట గ్రామ ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు డోల కూర్మినాయుడుపై వచ్చిన ఫిర్యాదుల మేరకు మంగళవారం గ్రామ సచివాలయం వద్ద ఎచ్చెర్ల క్లస్టర్ ఏపీడీ లోకేష్ ఆధ్వర్యంలో వేతనదారులు సమక్షంలో విచారణ చేపట్టారు. వేతనదారుల నుంచి వారానికి వంద రూపాయలు చొప్పున్న వసూలు చేస్తున్నారని, గ్రామంలో లేని వారికి, ఉపాధి పనికి రానివారికి తప్పుడు మస్తర్లు వేశారని పలు అభియోగాలపై వేతనదారుల నుంచి స్టేట్‌మెంట్ నమోదు చేసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్టు ఏపీడీ తెలిపారు. ఈ విచారణలో సర్పంచ్ పున్నాన సోనియా, ఏపీవో సీహెచ్ సత్యనారాయణ, టీఏ లక్ష్మణరావు, గ్రామ పెద్దలు పి.అక్కలనాయుడు, మక్క శ్రీనివాసరావు, మీసాల రమణ, వేతనదారులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

సరుబుజ్జిలి, మే 13(ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం గ్రామ అయ్యప్పస్వామి వారి ఆలయ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు ఆరవెల్లి భాస్కరశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి క్షీరాభిషేకాలు, సహ స్రనామార్చనలు, పండిత పరిషత్, హోమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ సమీపంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఈ పూజల్లో కమిటీ సభ్యులతో పాటు, పలువురు భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.





ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్- ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

పిడుగుపడి యువతి మృతి

కొత్తూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): అడ్డంగి గిరిజన గ్రామంలో సోమవారం పొద్దుపోయే సమయంలో పిడుగు పడి సవర చిన్నారమ్మ(30) మృతి చెందింది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సోమవారం సాయంత్రం మేకలు కాస్తున్న సమయంలో పిడుగుపడడంతో ఆమె కొండపైనే మృతి చెందింది. చిన్నారమ్మ ఎంతసేపటికీ ఇంటికి చేరకపోవటంతో కుటుంబ సభ్యులు కొండల్లో వెతికారు. చివరికి విగతజీవిగా కనిపించడంతో కన్నీరుమున్నీరయ్యారు. మృతురాలి తమ్ముడు సవర రాజారావు మంగళవారం ఉదయం దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అమీర్ అలీ తెలిపారు.

10 మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

కొత్తూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం పారాపురం గ్రామం వద్ద ఓ వ్యక్తి నుంచి 10 మద్యం సీసాలు పట్టుకున్నట్లు కొత్తూరు ఎస్ఐ అమీర్ అలీ తెలిపారు. మద్యం సీసాలు తరలిస్తున్న వ్యక్తి బమ్మిడి గ్రామానికి చెందిన దవిలి తిరుపతిరావుగా గుర్తించామన్నారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని...అతన్ని అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు.

గంజాయితో ఇద్దరు..


వివరాలు వెల్లడిస్తున్న సీఐ అవతారం

జి.సిగడాం, మే 13(ఆంధ్రజ్యోతి): వాండ్రంగి పంచాయతీ చీడిపేట కూడలి వద్ద గంజాయి తరలిస్తుండగా ఇద్దరు వ్యక్తులను మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జేఆర్ పురం సీఐ ఎం.అవతారం తెలిపిన వివరాల మేరకు.. వాండ్రంగి గ్రామానికి చెందిన మీసాల జగన్నాథరావు, శ్రీకాకుళం వాంబే కాలనీకి చెందిన యారగళ్ల పవన్‌కుమార్ 2.3 కిలోల గంజాయి తరలిస్తుండగా జి.సిగడాం పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. గంజాయి స్వాధీనం చేసుకొని వీరిద్దరిని అదుపులోకి తీసుకుని పొందూరు కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు. వీరితో సంబంధాలు ఉన్న ఒడిశా రాష్ట్ర సుంకి సమీపంలోని లోవడి గ్రామానికి చెందిన కరిజాం లచ్చన్న, శ్రీకాకుళం పట్నం బలగ ప్రాంతానికి చెందిన మీగడ గోపి కోసం గాలిస్తున్నామన్నారు. జగన్నాథరావు రాజమండ్రిలో ఇంటర్ వరకు చదువుకొని, విశాఖలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేసి, శ్రీకాకుళంలో ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తూ గంజాయికి అలవాటు పడ్డాడు. పవన్ కుమార్ పదో తరగతి వరకు చదివి ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ మద్యానికి బానిసై కరోనా లాక్‌డౌన్ సమయంలో మద్యం లభించక గంజాయికి అలవాటు పడ్డాడు. జి.సిగడాం, రణస్థలం ఎస్ఐలు వై.మధుసూధనరావు, చిరంజీవి ఉన్నారు.

నలుగురిపై కేసు నమోదు

ఎచ్చెర్ల, మే 13(ఆంధ్రజ్యోతి): దుప్పలవలస గ్రామానికి చెందిన ఇమంది అనిత ఫిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులపై కేసు నమోదైంది. ఎచ్చెర్ల పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దుప్పలవలసకు చెందిన అనితకు ముద్దాడకు చెందిన వంకా ముత్యాలరావుతో ఐదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఒక కుమార్తె కూడా ఉంది. తన భర్త క్రికెట్ బెట్టింగ్‌లో రూ.4 లక్షలు పోగొట్టుకుని పెళ్లైన రెండేళ్ల నుంచి డబ్బులు తెమ్మని తనను వేధిస్తున్నాడని అనిత తన ఫిర్యాదులో పేర్కొంది. వేధింపులు తాళలేక 2022లో తాను కన్నవారింటికి వచ్చేశానని, తిరిగి వచ్చేస్తానని చెప్పినా పట్టించుకోకుండా వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. పలుమార్లు గ్రామంలో పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టినా తన భర్త వైఖరిలో ఎలాంటి మార్పురాలేదని ఫిర్యాదులో పేర్కొంది. అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త ముత్యాలరావు, అత్త సూర్యకళ, మామ రమణ, ఆడపడుచు జానకిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ఎచ్చెర్ల, మే 13(ఆంధ్రజ్యోతి): బొంతలకోడూరు గ్రామానికి చెందిన యార్లంగి నవ్యఈశ్వరి అనే యువతి ఈ నెల 12వ తేదీ నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి ఆదిలక్ష్మి మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నవ్య ఈశ్వరి శ్రీకాకుళంలో నర్సింగ్ కోర్సు చదువుతోందని, ఈ నెల 11న కళాశాలకు వెళ్లి తిరిగి వచ్చి రాత్రి ఇంట్లోనే నిద్రించిందని తెలిపారు. తెల్లవారేసరికి కన్పించలేదని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పశువుల రక్త నమూనాలు సేకరణ

హరిపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా విశాఖపట్నం క్వాలిటీ అనలిటికల్ లేబొరేటరీ ఏడీ డాక్టర్ రమాదేవి, జిల్లా యానిమల్ డయాగ్నస్టిక్ లేబొరేటరీ వైద్యులు డాక్టర్ ఆర్.కిషోర్ ఆధ్వర్యంలో మంగళవారం పశువుల రక్తనమూనాలను సేకరించారు. మందస మండలం అల్లిమెరక గ్రామంలో పశువైద్యులు డాక్టర్ డి.శ్రీకాంత్, కిల్లి ఉమాభారతి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో ర్యాండమ్‌గా కొన్ని గ్రామాలను గుర్తించి రక్త నమూనాలను సేకరిస్తున్నామని తెలిపారు. ల్యాబ్‌లో పరీక్షించడం ద్వారా క్షేత్రస్థాయిలో టీకాలు వేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సంతోషి, శ్రీను, తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి


సమావేశంలో మాట్లాడుతున్న సూరాడ మోహనరావు

వజ్రపుకొత్తూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకు వెళ్లాలని మండల టీడీపీ అధ్యక్షులు సూరాడ మోహనరావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే గౌతు శిరీష కార్యాలయంలో మండల టీడీపీ ముఖ్యనాయకులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలపై చర్చించి ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. సమావేశంలో నాయకులు గొరకల వసంతస్వామి, కర్ని రమణ, ఎ.ఉమామహేశ్వరరావు, కణితి సురేష్, జోగి తిరుపతిరావు, కె.గణపతి తదితరులు పాల్గొన్నారు.

50 ఏళ్లకే పింఛను అందించాలి

వజ్రపుకొత్తూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణులకు 50 ఏళ్లకే పింఛను అందించేందుకు చర్యలు తీసుకోవాలని మండల విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు లక్కోజు ధర్మారావు కోరారు. మంగళవారం వజ్రపుకొత్తూరులో విలేకరులతో మాట్లాడారు. బంగారం ధరలు పెరిగిపోవడంతో స్వర్ణకారులకు పనులు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పింఛను అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

భూ సర్వేలో అక్రమాలపై అన్నదాతల ఆందోళన


తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

కొత్తూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): కల్లిమ్మ రెవెన్యూ పరిధిలో గతంలో జరిగిన భూసర్వే అక్రమాలను సరిదిద్ది, రైతులకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం తహసీల్దారు కార్యాలయాన్ని రైతులు ముట్టడించారు. తమ సమస్యలను తహసీల్దారు బాల కృష్ణకు విన్నవించారు. గ్రామంలో సుమారు 350 మంది రైతుల భూములను ఇతరుల పేర్లతో నమోదు చేసి సర్వే అధికారులు తప్పిదాలకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై గత పది నెలలుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా న్యాయం చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ గ్రామంలో కనీసం సెంటు భూమిలేని వ్యక్తులకు భూమి ఉన్నట్లు జాయింట్ ఖాతాలు చూపి.. సర్వేలో భూములు ఉన్నట్లు నమోదు చేసి తగాదాలకు కారణంగా నిలుస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములను కూడా ఇతరుల పేరుతో నమోదు చేసి రైతుల్లో గందరగోళం సృష్టించారని వివరించారు. నెలరోజుల్లో సమస్యను పరిష్కరిస్తాని ఇటీవల టెక్కలి ఆర్డీఓ రైతులకు హామీ ఇచ్చి రెండు నెలలు దాటుతున్నా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. తమ పేరున ఉన్న భూములకు ఇతరుల పేరుతో నమోదు చేయటం వల్ల బ్యాంకు రుణాలు రెన్యువల్ చేయడానికి, ప్రభుత్వ పథకాలు అందుకోవడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. తమకు న్యాయం చేయకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని రైతులు స్పష్టం చేశారు.

19న సారవకోట మండల ఉపాధ్యక్ష స్థానానికి ఎన్నిక

జలుమూరు (సారవకోట), మే 13 (ఆంధ్రజ్యోతి): మండల ఉపాధ్యక్ష స్థానానికి ఈనెల 19న ఎన్నిక నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి, ఎన్నికల అధికారి మంద లోకనాథం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల ఉపాధ్యక్ష ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 15 లోగా మండలంలో గల ఎంపిటీసీలకు సమాచారం చేరవేస్తున్నట్లు తెలిపారు. 19న ఉదయం 11 గంటలకు చేతులు ఎత్తే పద్ధతిలో మండల ఉపాధ్యక్షుడిని ఎంపిటీసీ సభ్యులు ఎన్నుకుంటారని తెలిపారు. ఇదివరలో మండల ఉపాధ్యక్షునిగా పనిచేసిన అనిరయ్య మృతి చెందడంతో ఆ స్థానానికి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో 15 మంది ఎంపిటీసీ సభ్యులు ఉన్నారు. ఇందులో ఇద్దరు ఎంపిటీసీ సభ్యులు మృతి చెందారు. మిగతా 13 మంది ఉపాధ్యక్షుడిని ఎన్నుకుంటారని ఆయన తెలిపారు. మెజారిటీ ఎంపిటీసీ సభ్యులు ఎవరికి మద్దతు తెలిపితే వారు ఉపాధ్యక్షునిగా ఎన్నికవుతారని తెలిపారు.

రైతు సంఘాలతో జీడిపిక్కల సేకరణ


సమావేశంలో మాట్లాతున్న ఏపీఎం కూర్మారావు

హరిపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): వన్‌ధన్ వికాస కేంద్రాలను సమర్థంగా నిర్వహణకు ప్రభుత్వం రైతు సంఘాల ద్వారా జీడిపిక్కల సేకరణ చేపడుతోందని ఏపీఎం పైడి కూర్మారావు తెలిపారు. మందస మండల సమాఖ్య భవనంలో మంగళవారం బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని వందశాతం అమలు చేసి రైతులకు భరోసా కల్పించాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా ఎఫ్‌సీవోల ద్వారా వీటిని సేకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కృష్ణకుమారి, కల్యాణి, సీసీలు తారక్, మంగమ్మ, మీనాక్షి పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు


సర్వే చేస్తున్న ఉపాధ్యాయులు కృష్ణప్రసాద్

జలుమూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) గ్రామాల్లో ప్రత్యేక అవసరాల గల దివ్యాంగ విద్యార్థుల వివరాలు సేకరిస్తున్నట్టు ఐఈఆర్‌పీ ఉపాధ్యాయుడు కృష్ణప్రసాద్ తెలిపారు. జలుమూరు, అల్లాడ, తదితర గ్రామాల్లో మంగళవారం దివ్యాంగ పిల్లలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సర్వేలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల జాబితాను జిల్లా కార్యాలయానికి నివేదిస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో 10 మంది దివ్యాంగ పిల్లలను గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌పీ ఉపాధ్యాయుడు రమేష్, వివిధ గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతానికి కృషి చేయండి


మందస:మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు


కాశీబుగ్గ: మాట్లాడుతున్న వివిధ సంఘాల ప్రతినిధులు

మందస, మే 13(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20వ తేదీన తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. మందస అంబేద్కర్ భవనంలో మంగళవారం సీఐటీయూ మండల కన్వీనరు కె.కేశవరావు అధ్యక్షతన సమ్మె సన్నాహక సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్‌ల రద్దు, కనీస వేతనాలు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, అసంఘటిత రంగ కార్మికులకు వెల్ఫేర్‌బోర్డు తదితర డిమాండ్లపై సమ్మె తలపెట్టినట్టు చెప్పారు. ఈ సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎన్.గణపతి, వీఆర్‌ఏల సంఘ నాయకులు పి.శ్రీనివాసరావు, ఎ.కృష్ణారావు, బి.వెంకటేశం, ఎస్.జగ్గారావు, కె.తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు సిద్ధం

కాశీబుగ్గ, మే 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న జరగబోయే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ, ఐ.ఎఫ్.టి.యు., ఏఐసీటీయూ నాయకులు పిలుపు నిచ్చారు. మంగళవారం కాశీబుగ్గ సీఐటీయూ కార్యాలయంలో సమ్మె సన్నాహక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌ల రద్దు కోసం పోరాటానికి సిద్ధం కావాలని కోరారు. కనీస వేతనాలు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, స్కీమ్ వర్కర్లకు ఉద్యోగులుగా గుర్తింపు వంటి సమస్యలపై ఈ సమ్మె తలపెట్టినట్టు తెలిపారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణపతి, దుష్యంత్, లోకనాథం, మాధవరావు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులపై అక్రమ కేసులు పెడితే అడ్డుకుంటాం

జలుమూరు (సారవకోట), మే 13 (ఆంధ్రజ్యోతి): కొండ ప్రాంతాల్లో నివశిస్తున్న అమాయక గిరిజనులపై అక్రమ కేసులు పెడితే అడ్డుకుంటామని జిల్లా గిరిజన ఐక్యవేదిక సంఘ ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక గిరిజన సంఘం భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొండ ప్రాంతాల్లో నాటు సారా తయారు చేస్తున్నారని అమాయక గిరిజనులపై పోలీసులు కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. అమాయక గిరిజనులపై తప్పుడు కేసులు నమోదు చేస్తే వారి న్యాయం కోసం పోరాటం చేస్తామని హెచ్చరించారు. అమాయక గిరిజనులపై ఎక్సైజ్ పోలీసులు కేసులు నమోదు చేయడం అన్యాయమన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లి తప్పుడు కేసులు నమోదు చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో పలువురు ఎస్టీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు


గంగరాజపురంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మెళియాపుట్టి, మే 13 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తే లాభదాయకంగా ఉంటుందని డీపీఎం పూజారి సత్యనారాయణ తెలిపారు. మంగళవారం గంగరాజుపురం, కొసమాల గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై గ్రామసభలు నిర్వహించారు. ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయంతో చేసే ఉత్పత్తులను తినడానికి ప్రజలు అలవాటు పడుతున్నందు వల్ల రైతులకు లాభాలు వస్తాయని వివరించారు. రైతుల కు ప్రభుత్వం నుంచి రాయితీలు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళిలో...

సంతబొమ్మాళి, మే13 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన ఆహారోత్పత్తికి రాబోయే కాలంలో ప్రకృతి వ్యవసాయ విధానాలే శరణ్యమని మండల వ్యవసాయాధికారి ఆర్.అప్పారావు అన్నారు. మంగళవారం ఎవరపేటలో నవధాన్యాల సాగుపై రైతులకు అవగహన కల్పించారు. వినియోగదారుల్లో రసాయన రహిత సేద్యపు ఉత్పత్తులపై మక్కువ పెరుగుతున్న దృష్ట్యా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో గిరాకీ రానుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి రెడ్డి అప్పన్న, రైతులు తెలుగు భీమారావు, గొండు కన్నయ్యలను సన్మానించారు.

బాలికలు హక్కులను వినియోగించుకోండి


బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఈశ్వరమ్మ

జలుమూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల రక్షణ కోసం ప్రభుత్వం హక్కులను కల్పించిందని.. వాటిని సద్వినియోగ పరచుకోవాలని తిమడాం అంగన్‌వాడీ కార్యకర్త వెలమల ఈశ్వరమ్మ తెలిపారు. మంగళవారం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కిశోర బాలికల అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికల రక్షణ కోసం పోక్సో చట్టం అమలు చేశారని తెలిపారు. బాలికలు తమ హక్కులను కాపాడుకోవాలని ఆమె తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో మహిళా పోలీసు మంజుల, తదితరులు పాల్గొన్నారు.

కౌలురైతులను గుర్తించాలి


మాట్లాడుతున్న తహసీల్దారు పాపారావు

మెళియాపుట్టి, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అన్నదాతా సుఖీభవ పథకం ప్రవేశపెడుతున్నందు వల్ల కౌలురైతులను గుర్తించాలని తహసీల్దారు బి.పాపారావు సూచించారు. మంగళవారం రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. కౌలుచేస్తున్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కౌలుదారులకు కార్డులు ఇవ్వనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ ప్రణాళికపై అవగాహన సదస్సులు

కంచిలి, మే 13(ఆంధ్రజ్యోతి): రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులు వేయాల్సిన పంటలపై అంపురం, గోకర్ణపురం యూనిట్ల పరిధిలోని కుత్తుమ, అంపురం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు నవధాన్యాల సాగు చేయడం వల్ల కలగబోవు లాభాలను రైతులకు వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆదర్శ రైతులకు సన్మానించారు. కార్యక్రమంలో ఆదర్శ రైతులు రంగనాథం, కామేశ్వరరావు, కళ్ల జగన్నాథం, జనార్దన్, యాంకర్లు టి.శివానందం, కుమారి, కామరాజు, తులసయ్య, బి.పుష్ప, రోహిణి, మీనా పాల్గొన్నారు.

అవగాహనా ర్యాలీ

ఆమదాలవలస, మే 13(ఆంధ్రజ్యోతి): చేపేనపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులతో ఖరీఫ్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీడీఎఫ్ చేపేన సురేష్ మాట్లాడుతూ.. రానున్న ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వ్యవసాయంలో అనుసరించాల్సిన విధానాలను వివరించారు. అనంతరం రైతులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చేపేన సత్తిరాజు, సిబ్బంది తిరుపతిరావు, లక్ష్మి, కృష్ణవేణి, రైతులు కోటేశ్వరరావు, అప్పలనాయుడు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

31న ఎండల మల్లికార్జునుని కల్యాణం

టెక్కలి, మే 13 (ఆంధ్రజ్యోతి): శైవక్షేత్రమైన రావివలసలో గల ఎండలమల్లికార్జున స్వామి వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవం ఈనెల 31న నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు. తిరువీధి, సహస్ర ఘటాభిషేక అర్చన, భ్రమరాంబిక సహిత ఎండలమల్లికార్జునస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

21న శ్రీముఖలింగేశ్వరుని భూముల కౌలుకు వేలం

జలుమూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగేశ్వరస్వామి హక్కు, అనుభవంలో గల భూములు కౌలుకు ఇచ్చేందుకు ఈనెల 21న టెండర్ కమ్ బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో పి.ప్రభాకరరావు తెలిపారు. ఈ కౌలు వేలం పాట 3 సంవత్సరాలకు ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల రైతులు బిట్టు ఒక్కింటికి రూ.లక్ష సాల్వెన్సీ ధ్రువీకరణ పత్రంతో పాటు ప్రథమ ధరావత్తు కింద రూ.30 వేలు చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు. కౌలు హక్కు ఆమోద ఉత్తర్వులు పొందిన తరువాతనే భూమిలో సాగుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

117 ఉపాధ్యాయ పోస్టులు మంజూరు

హిరమండలం, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు మంజూరైనట్టు ఎంఈఓ కె.రాంబాబు చెప్పారు. మండల పరిషత్ పాఠశాలలకు ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు-6, స్కూల్ అసిస్టెంట్లు-32, ఎస్జీటీలు-79 పోస్టులు మంజూరయ్యాయని చెప్పారు. మండలంలో క్లియర్ వేకెన్సీ-7, ఎనిమిది సంవత్సరాల పైబడిన వారు-18, రీ-అప్పొరేషన్ ఖాళీలు-28 ఇలా మొత్తం 53 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. మండల పరిషత్ ఉన్నత పాఠశాలలతో కలిపి మిగులు పోస్టులు 37 ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఒకే పాఠశాలలో ఎనిమిదేళ్ల పూర్తి చేసుకున్న వారు తప్పనిసరిగా బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అధిక ధరలపై చర్యలు తీసుకోండి

పాతపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి): అధిక రేట్లకు పుస్తకాలు అమ్ముతున్న ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని అఖిలభారత విద్యార్థి పరిషత్ కన్వీనర్ చింత అరవింద్ డిమాండ్ చేశారు. ప్రవేటు విద్యాసంస్థల్లో పుస్తకాలు, నోట్ పుస్తకాలు, దుస్తుల పేరుతో అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిని అధికారులు పరిశీలించి..చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అధిక ఫీజుల భారంతో పేద విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్లలో చదువుకు భయపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నందిగాం, మే 13(ఆంధ్రజ్యోతి): నందిగాం శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్‌కిరణ్ ఆధ్వర్యంలో జూనియర్ విభాగం వారికి పర్యావరణం ఆవశ్యకత, సీనియర్ విభాగంలో విద్యార్థులకు సోషల్‌మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ప్రభావంపై ఈ పోటీలు నిర్వహించారు.

నీటికుంటలు పూర్తి చేయండి

మెళియాపుట్టి, మే 13 (ఆంధ్రజ్యోతి), నీటి కుంటలను పూర్తి చేయాలని ఎంపీడీఓ ప్రసాద్ పండా తెలిపారు. మంగళవారం ఉపాధి అధికారులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. నీటికుంటల వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అలసత్వం వ్యహించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏపీవో రవి పాల్గొన్నారు.

పాతపట్నంలో...

పాతపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి):ఈ నెలాఖరు నాటికి నీటి కుంటలను పూర్తి చేయాలని ఎంపీడీవో చంద్రకుమారి ఆదేశించారు. మంగళవారం ఉపాధి అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలో 540 గుంతలు తీయవలసి ఉండగా.. 120 మాత్రమే తీశారని గుర్తు చేశారు. రైతులకు అవగాహన కల్పించి.. చర్యలు చేపట్టాలని కోరారు.

క్రీడల్లో నైపుణ్యం అవసరం

ఎచ్చెర్ల, మే 13(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించాలని రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి పున్నల నర్సింహారెడ్డి అన్నారు. కేశవరావుపేటలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. సాఫ్ట్‌బాల్, వాలీబాల్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడి భాస్కరరావు, అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మెట్ట తిరుపతిరావు, ఎంపీ రమణ, పీఈటీ జి.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.